andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6 : కనిష్ఠం 19.7
నిర్మల్ జిల్లా వార్తలు
6
బుధవారం 26 ఫిబ్రవరి 2025



సిద్ధేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలు



నర్సాపూర్(జి), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డొంగుర్‌గాం సిద్దేశ్వరాలయం, టెంబుర్ని గ్రామంలోని శ్రీ చక్ర లింగేశ్వరాలయం శివరాత్రి ఉత్సవా లకు ముస్తాబు చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. డొంగుర్‌గాం ఆలయ కమిటీ సభ్యులు,యువకులు గణేష్, నరేష్, సంతోష్, సతీష్, దేవన్న, భోజరాం, వినాయక్,మోహన్ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సిద్దేశ్వరాలయంలో మన్మథ్ గ్రామానికి చెందిన వెంకటరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



మంకీ రెస్క్యూ సెంటర్‌లో కోతికి ఆపరేషన్ చేస్తున్న దృశ్యం

మంకీ రెస్క్యూ సెంటర్‌కు ఆదరణ కరువు

- జిల్లాలో పెరగని కోతుల కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు
- కోతుల పట్టివేతకు ముందుకు రాని స్థానిక సంస్థలు
- నిధులు లేవంటున్న పంచాయతీలు, మున్సిపాలిటీలు
- ఒక్కో కోతికి వెయ్యికి పైగా వ్యయం
- వానరాల సంచారం, దాడులతో జనం బెంబేలు
- రెస్క్యూ సెంటర్‌పై నీలి నీడలు

నిర్మల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా కోతుల సమస్య ఓ సామాజిక సమస్యగా మారింది. రోజు రోజుకు కోతుల జనాభా విపరీతంగా పెరిగిపోతుండడం యంత్రాంగానికి సవాలుగా మారుతోం ది. కోతుల ఆగడాలు, బీభత్సకరమైన చేష్టలతో ఇటు జనం బెంబేలెత్తుండడగా అటు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాం తాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కోతుల గుంపులు చేస్తున్న ఆగడా లు మితిమీరిపోతున్నాయి. రోజురోజుకు ఈ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. అయితే నిర్మల్‌లో ఏర్పాటు చేసిన మంకీ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ కోతుల సంఖ్యను నిరోధించడంలో వెనకబడుతోందని అంటున్నారు. ఇక్కడ కోతులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసేందుకోసం రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దేశంలో ఇది రెండో కేంద్రం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇదిలా ఉండగా కోతుల సంతాన ఉత్పత్తి ప్రక్రియ వేగంగా కొనసాగుతూ ఉండడం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుం ది. రాత్రింబవళ్లు కోతుల సంచారంతో పాటు వాటి ఆగడాలు మితిమీరిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే పంట పొలాలపై కోతుల గుంపులు దాడులు చేస్తుండడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. ఇలాంటి సమస్యల కారణంగా అప్పటి ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో నిర్మల్‌లోని గండిరామన్న హరితవనం ప్రాంగణంలో మంకీరెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అయితే వన్యప్రాణుల సంరక్షణ చట్టంకు అనుగుణంగా కోతులపై ఎలాంటి కఠినచర్యలు తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇక్కడి మంకీ రెస్క్యూసెంటర్‌లో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయాలని నిర్ణయించారు. దీని కోసం ఒక డాక్టర్‌తో పాటు ఫార్మాసిస్ట్, నలుగురు అటవీసిబ్బందిని నియమించారు. ప్రస్తుతం ప్రతీ గ్రామంలోనూ, మున్సిపాలిటీలోని ప్రతివార్డులోనూ కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి వాటి ఆగడాలు శృతి మించుతున్నప్పటికి మున్సిపాలిటీలు గానీ, గ్రామ పంచాయతీలు గాని పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ, పంచాయతీలు కోతులను పట్టించి ఇక్కడి మంకీ రెస్క్యూసెంటర్‌కు తీసుకువస్తే వాటికి స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ) ఆపరేషన్‌లు చేయాల్సి ఉంటుంది. కోతుల జనాభాను తగ్గించాలంటే కేవలం జనాభా నియంత్రణ ఆపరేషన్‌లు తప్ప మరో మార్గం లేదు. వేగంగా వాటి సంతానం పెరుగుతుండడంతో వీటి సంతానాన్ని అరికట్టడమే సమస్యకు పరిష్కార మార్గంగా చెబుతున్నారు. కాగా నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో గత నాలుగేళ్ల నుంచి స్థానిక సంస్థల నిర్లక్ష్యం కారణంగా కేవలం 1500 స్టెరిలైజేషన్‌లు మాత్రమే చేశారు. ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉండడంతో నెలకు దాదాపు 500 లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్‌లు చేసే సౌకర్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కోకోతిని పట్టేందుకు రూ.1000పైగా ఖర్చు అవుతుండడంతో అసలే నిధుల కొరతతో సతమతమవుతున్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఇది భారంగా మారింది. కోతుల సమస్యలను భరిస్తున్నప్పటికి నిధుల కొరత కారణంగా వాటిని పట్టించే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు మున్సిపల్ చైర్మన్‌లు, మాజీ సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కోతుల సమస్యను నివారించేందుకు నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. దీని కోసం గానూ కోతులను పట్టించి ఇక్కడి సెంటర్‌కు తరలించే బాధ్యతలు పూర్తిగా ప్రభుత్వమే తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కన కోతుల గుంపు

వీడీసీల సహాయ నిరాకరణ

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో కొనసాగుతున్న వీడీసీలు కోతుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వీడీసీలు సమాంతర వ్యవస్థను నడుపుతుండడమే కాకుండా అక్కడి ఆర్థిక వనరులన్నింటిని తమ గుప్పిట్లో ఉంచుకున్నాయన్న వాదనలున్నాయి. ఇసుక వ్యవహారాలు, బెల్ట్ షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, కల్లు దుకాణాల నిర్వహణ బాధ్యతనంతా ఈ వీడీసీలే నిర్వహిస్తున్నాయన్నది బహిరంగ సత్యమే. గ్రామ పంచాయతీల కన్నా ఆర్థికంగా వీడీసీలే బలంగా ఉండడంతో కోతుల తరలింపు బాధ్యతలను కూడా వీడీసీలే తీసుకోవాలని కోరుతున్నారు. ఒక్కో కోతిని పట్టేందుకు దాదాపు రూ. 1000 రూపాయలకు పైగా ఖర్చు అవుతుందని అలాగే రవాణా ఖర్చులు కూడా ఉంటాయని ఈ ఆర్థిక భారాన్ని భరించే స్థోమత ఒక్క వీడీసీలకే ఉందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఈ బాధ్యతలను తీసుకోవాలంటే ఆర్థిక పరంగా భారమవుతుందని, వీడీసీలు ఈ దిశగా చొరవ తీసుకొని సమస్యకు పరిష్కార మార్గం చూపాలని కోరుతున్నారు.

కుటుంబ నియంత్రణ గుర్తింపు పచ్చబొట్లు..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేసిన కోతులకు ఇక్కడి వైద్యాధికారి నుదుటిపై టాటూలు వేస్తున్నారు. ఇలా టాటూలు కనిపించిన కోతికి స్టెరిలైజేషన్ పూర్తయినట్లు తెలిసిపోతోంది. స్టెరిలైజేషన్ పూర్తయిన కోతులకు ఇక సంతాన ఉత్పత్తికి అవకాశం ఉండదు. దీంతో క్రమంగా వాటి జనాభాను తగ్గించవచ్చని వైద్యాధికారి పేర్కొంటున్నారు. రెండేళ్ళ వయస్సు పై బడిన వాటికే కాకుండా 55 కిలోల బరువు ఉన్న కోతులకు మాత్రమే కాగా ఇప్పటి వరకు ఇక్కడ కేవలం 1500 కోతులకు మాత్రమే స్టెరిలైజేషన్ జరగడం గమనార్హం.

మూసివేత దిశగా రెస్క్యూ సెంటర్..

మంకీ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్‌పై క్రమంగా నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. నిర్వహణ వ్యయంతో పాటు స్థానిక సంస్థల నుంచి గానీ ప్రజల నుంచి గానీ స్టెరిలైజేషన్‌ల కోసం స్పందన రాకపోవడంతో ఈ సెంటర్‌ను మూసివేయాలని అటవీ శాఖ భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా కోతులు రెండు రకాలుగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. రీసెస్ మక్కా, బ్యానెట్ మకాక్ రకాల కోతులు ఉంటాయని అయితే ప్రస్తుతం మన ప్రాంతంలో బ్యానెట్ మకాక్ ఉండేవని ఆ కోతులన్ని తమిళనాడు ప్రాంతానికి తరలిపోయాయని చెబుతున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఎనిమిది మంకీ రెస్క్యూ సెంటర్‌లుండా దక్షిణ భారతదేశంలో మాత్రం ఏకైక మంకీ రెస్క్యూ సెంటర్ నిర్మల్‌లో మాత్రమే ఉండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ సెంటర్‌ను కూడా అటవీశాఖ మూసివేసే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న కారణంగా కోతుల బాధితులు మరింత ఆందోళనకు గురువుతున్నారు.

పంచాయతీలు సహకరించాలి

డాక్టర్ శ్రీకర్ రాజు, మంకీ రెస్క్యూ సెంటర్ మెడికల్ ఆఫీసర్, నిర్మల్

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్ రిబిహాబిటేషన్ సెంటర్‌లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే డాక్టర్‌తో పాటు సిబ్బంది కూడా ఉన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చొరవ తీసుకొని కోతులను పట్టించి సెంటర్‌కు తీసుకురావాలి. ప్రతినెల 500 లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే సౌకర్యం ఇక్కడ అందుబాటులో ఉంది. కోతులను పట్టే వారి కొరత ఉండడమే కాకుండా ఖర్చు కూడా ఎక్కువగా ఉంటుంది. అయితే కోతుల సంచారాన్ని నిరోధించాలంటే స్టెరిలైజేషన్ తప్పనిసరి. కోతుల జనాభాను తగ్గించడమే సమస్యకు పరిష్కారం చూపుతోంది. ఇక్కడ రెస్క్యూ సెంటర్‌లో స్టెరిలైజేషన్ తర్వాత కొద్ది రోజుల పాటు ఇక్కడే పునరావాసం కూడా కల్పించే సౌకర్యం అందుబాటులో ఉంది.

కలెక్టరేట్, ఆర్డీవో ఆఫీసుల

జప్తుకు కోర్టు ఆదేశం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల నిర్మాణంతో భూములు కోల్పోయిన జిల్లా రైతులకు నష్ట పరిహారం ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరగడం పట్ల నిర్మల్ జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం నిర్మల్ కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో కార్యాలయ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని జడ్జి ఆదేశాలను జారీ చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని మండల విద్యాశాఖ అధికారి శంకర్ అన్నారు. సిర్గాపూర్ ప్లేయర్ హైస్కూల్ పాఠశాల వార్షికోత్సవానికి ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే మట్టిలో మాణిక్యాల్లాంటి విద్యార్థులు బయటకు వస్తారన్నారు. వివిధ రంగాల్లో విద్యార్థులను ప్రతిభావంతులను తయారు చేసేందుకు పాఠశాల స్థాయిలో పునాదులు పడితేనే సాధ్యమవుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఉన్న ఆత్మన్యూనత భావం దూరమై ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాన్ని ఎంఈవో అభినందించారు.
విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఆధునిక, సాంప్రదాయక నృత్యాలు అబ్బుర పరిచాయి. ప్రధానంగా మహాభారతంలోని వివిధ ఘట్టాలను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా రక్తి కట్టించారు. ఈ సందర్భంగా క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సాయికిరణ్, అంకుర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుష్మ, అరవింద ప్రధానోపాధ్యాయులు భోజారెడ్డి, కరస్పాండెంట్ నరసింహరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా పరీక్షలకు చదవాలి

- ఎంపీడీవో రాధారాథోడ్

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికబద్ధంగా పది పరీక్షలకు ప్రిపేర్ కావాలని ఎంపీడీవో రాధారాథోడ్ విద్యార్థులకు మంగళవారం సూచించారు. మండలంలోని పీచర, ధర్మారం, మల్లాపూర్ గ్రామ పంచాయతీల్లో నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. పీచర జడ్పీహెచ్ఎస్ పదవ తరగతి విద్యార్థులతో మమేకమై ముచ్చటించారు. మార్చి 21న ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని గతంలో ఉన్న ప్రశ్న పత్రాలను ఒక్కసారి తిరిగేయాలని, మూడు గంటల సమయాన్ని ప్రశ్నపత్రంపై కేంద్రీకరించాలన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా మానసికంగా చాలా ప్రశాంతంగా, దృఢంగా ఉండాలని తెలియజేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో కుక్కల దాడుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలలో వీధి కుక్కల వల్ల ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నందున వాటి నియంత్రణకు మున్సిపల్, వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి వాటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వీధి కుక్కలను పట్టుకునే బృందాలను ఏర్పాటు చేసి, వాటిని పునరావాస కేంద్రాలకు తరలించి, జనాభా నియంత్రణకు శస్త్ర చికిత్సలు నిర్వహించాలని, అనంతరం వాటిని జనావాసాలకు దూరంగా రిజర్వ్ ఫారెస్ట్‌లలో విడిచి పెట్టలని సూచించారు. వీధి కుక్కల పట్టివేతకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. కుక్క కాట్లకు గురై ఆసుపత్రులకు వచ్చే బాధితులకు వ్యాక్సిన్లు వేసి, మెరుగైన చికిత్సలను అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంబంధిత వ్యాక్సిన్‌లను సరిపడినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలెవరు వీధి కుక్కల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. వేసవి కాలం సమీపిస్తున్నందున నీరు దొరకక కుక్కలు మరింత ఆగ్రహంతో ఉంటాయని, వాటికి పలు ప్రదేశాల్లో తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, ఈఈ పీఆర్ టి. శంకరయ్య, పశుసంవర్ధక అధికారి బాలిక్ అహ్మద్, నిర్మల్ మున్సిపాలిటీ డీఈ హరిభువన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బ్యాలెట్‌బాక్స్‌లను పరిశీలించిన కలెక్టర్

నిర్మల్‌లో ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఉపాధ్యాయ పట్టభద్రుల, ఎమ్మెల్సీ ఎన్నికలకు వినియోగించే బ్యాలెట్ బాక్స్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్‌లతో కలిసి ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బ్యాలెట్ బాక్స్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి అందించబోయే ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. 25 మంది సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల సామాగ్రిని రవాణా చేసే వాహనాలన్నింటికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో కండిషన్‌లో ఉన్న వాహనాలను వినియోగించాలన్నారు. అదనంగా వాహనాలను, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, భైంసాల ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, తహసీల్దార్ రాజు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సిపాలిటీలలో అన్ని రకాల పన్నుల వసూలు ప్రక్రియను త్వరిగతిన పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలలో వాణిజ్య, నీటి, వ్యాపార ప్రకటనల పన్నుల వసూలు వందశాతం పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీల వారీగా పన్ను వసూలు లక్ష్యం, ఇప్పటి వరకు పూర్తి చేసిన పన్ను వసూలు వివరాలను మున్సిపాలిటీల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మొత్తంలో పన్నులు కట్టకుండా ఉన్నవారి జాబితాను సిద్ధంచేసి, అందులోని మొదటి వంద మందికి రెడ్ నోటీసులను జారీ చేయాలన్నారు. ఇప్పటి వరకు రెడ్ నోఈటసులు జారీ చేసిన వారి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వాణిజ్య సముదాయాల అద్దెలు వసూలు చేయాలన్నారు. వాణిజ్య లైసెన్స్‌ల పునరుద్ధరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు జాదవ్ కృష్ణ, రాజేష్‌కుమార్, నిర్మల్ మున్సిపాలిటీ డీఈ హరిభువన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వెంకట్రాదిపేట్‌లోని ఓంకారేశ్వర ఆలయాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టిన పారిశుధ్య పనులు పరిశీలించారు. భక్తులకు మంచినీటి సదుపాయం, వీధి దీపాలు తదితర సదుపాయాల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు.

28న ఢిల్లీ ఆల్ ఇండియా సదస్సును జయప్రదం చేయండి

ఖానాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : 28వ తేదీన సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆల్ ఇండియా సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఖానాపూర్‌లోని మున్సిపల్ పార్క్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధనికులు, పేద ప్రజల మధ్య అసమానతలు మరింత పెరిగిపోయాయన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు, కార్పొరేట్, మతోన్మాద విధానాలతో ఇటువంటి పరిస్థితి తలెత్తుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆల్ ఇండియా సదస్సు నిర్వహిస్తుందని, ఈ సదస్సుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఢిల్లీ ఆల్ ఇండియా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ మండల నాయకులు జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, ఎం. శంకర్, గోరేబాయ్, పూసం లక్ష్మణ్, లింగు పటేల్, జితేందర్, తదితరులున్నారు.

ఏసీబీ దాడిలో

ఎక్సైజ్ ఎస్ఐ, కానిస్టేబుల్ పట్టివేత



ఏసీబీకి పట్టుబడిన కానిస్టేబుల్ సుజాత, ఎక్సైజ్ ఎస్ఐ పాటిల్ నిర్మల

భైంసా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెల్లకల్లు విక్రయాల్లో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు గాను రూ.10 వేల లంచం తీసుకుంటూ నిర్మల్ జిల్లా భైంసా ఎక్సైజ్ ఎస్ఐ పాటిల్ నిర్మల, కానిస్టేబుల్ సుజాతలు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ విజయ్ కుమార్ సారథ్యంలోని అధికారులు, సిబ్బంది ఎక్సైజ్ పోలీసు స్టేషన్ అవరణలో మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో లంచం తీసుకుంటుండగా దాడి చేసి వారిద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భైంసా మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన తెల్లకల్లు లైసెన్స్‌దారుడొకరు తన ప్రాంతంలో మరో లైసెన్స్‌దారుడు వచ్చి విక్రయాలు చేపడుతున్న విషయంలో ఎక్సైజ్ అధికారులను సంప్రదించారు . తన ప్రాంతంలో సంబంధిత లైసెన్స్‌దారుడు విక్రయాలు చేపట్టకుండా చూడాలని ఇక్కడి ఎక్సైజ్ మహిళా ఎస్ఐ పాటిల్ నిర్మలకు విజ్ఞప్తి చేసినట్లుగా సమాచారం. అయితే సంబంధిత సమస్య పరిష్కారం కోసం గాను సదరు ఎక్సైజ్ ఎస్ఐ పాటిల్ నిర్మల రూ.10 వేలు డిమాండ్ చేసినట్లుగా తెలిసింది. దీంతో లైసెన్స్‌దారుడు సంబంధిత విషయాన్ని ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగానే ఏసీబీ అధికారుల సూచనల మేరకు సదరు లైసెన్స్‌దారుడు మంగళవారం రాత్రి భైంసా ఎక్సైజ్ పోలీసు స్టేషన్ అవరణకు చేరుకొని మహిళా ఎస్ఐ పాటిల్ నిర్మలకు ఫోన్ చేసి తాను రూ.10 వేలు తీసుకొని వచ్చినట్లుగా తెలిపారు. ఇందుకు స్పందించిన మహిళా ఎస్ఐ పాటిల్ నిర్మల మహిళా కానిస్టేబుల్ సుజాతను పంపిస్తున్నానని ఆమేకు రూ.10 వేలు ఇవ్వాల్సిందిగా సూచించింది. దీంతో మహిళా కానిస్టేబుల్ బయటకు వెళ్లి అక్కడ ఉన్న లైసెన్స్‌దారుడి నుంచి రూ.10 వేలు తీసుకొని ఎక్సైజ్ పోలీసుస్టేషన్ లోనికి వెళ్లి తాను తీసుకున్న డబ్బులను ఎస్ఐ పాటిల్ నిర్మలకు అందించింది. అప్పటి వరకు అక్కడి ప్రాంతంలో కాపు కాచుకొని ఎదురు చూస్తున్న ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం దాడి చేసి వారిద్దరిని పట్టుకున్నారు. అనంతరం పంచానామ నిర్వహించి వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా హీరాసుక్క జయంతి వేడుకలు

ఇచ్చోడ, ఫిబ్రవరి, 25(ఆంధ్రజ్యోతి): గొండి ధర్మ గురు హీరాసుక్క జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గ స్థాయి ఉత్సవాలు ఇచ్చోడలో మంగళవారం ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రాదాయాలతో కొమురం భీం, డా.అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. గోండి ధర్మగురు హీరాసుక్క చూపిన మార్గంలో ముందుకు సాగాలన్నారు. ఇందులో ప్రధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ఉయికే సుదర్శన్, నాయకులు కుమ్రం కొటేశ్వర్, కొడప నగేష్, పుర్క జంగు, నగేష్, శ్రీనివాస్, బలిరాం, తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

ఉట్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగదురహిత లావాదేవీలు, శ్రీనిధి డిపాజిట్ పథకంపై నాబార్డు వారి సౌజన్యంతో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని కోలంగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాబార్డు ఎఫ్ఎల్‌సీ లోక రాం రెడ్డి మాట్లాడుతూ ప్రతీఒక్కరికి బ్యాంకులో పొదుపు ఖాతా ఉండవలెనన్నారు. ఆ తర్వాత పీఎం బీమా పథకాలపై అవగాహన కల్పించినారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో గ్రామ పటేల్ టేకంరాజు, ఫీల్డ్ ఆఫీసర్ రాజు, రైతులు పాల్గొన్నారు.

విజ్ఞాన మేళాలతో మేధస్సుకు పదును

బోథ్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన మేళాలతో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టినట్లు అవుతుందని తహసీల్దార్ సుభాష్ చంద్ర, సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో నిర్వహించిన విజ్ఞానమేళా సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు విజ్ఞానమేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మోడల్ స్కూల్ వార్షికోత్సవం

గుడిహత్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ఎంఈవో అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి : హేమలత

సిరికొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ హేమలత పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళలు నెలసరి బడ్జెట్‌ను ప్లాన్ చేసుకుని పొదుపుగా డబ్బులను వాడుకుని, అనవర ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను నిర్ణీత సమయానికి చెల్లించి క్రెడిట్ స్కోర్‌ను సముచితంగా ఉంచుకోవాలని సూచించారు. ఆర్బీఐ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ సంతోష్ మాట్లాడుతూ బ్యాంకు సేవలను ప్రతీ ఒక్కరు ఉపయోగించుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్‌క్రైమ్‌కు గురిగాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఏదైనా సమస్య ఉంటే 1930 సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేయాలని ఆయన వివరించారు. ఇందులో డీపీఎంలు శోభారాణి, కౌన్సిలర్‌లు పి.ధాంజీ, అరవింద్ గౌడ్, సీసీలు, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● జిల్లాకేంద్రంలో 500 వందల మంది మహిళలతో 2కే రన్ ర్యాలీ ● పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌ల ఆర్థిక అక్షరాస్యతపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రత్యేకంగా మహిళలు, మహిళా యువత బ్యాంక్‌ల ఆర్థిక అక్షరాస్యతపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రిజర్వు బ్యాంక్ అఫ్ ఇండియా వారు ఆర్థిక అక్షరాస్యత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఇందిర ప్రియదర్శిని స్టేడియం నుంచి 500మంది మహిళలతో 2కే రన్ ర్యాలీని ప్రారంభించారు. ఇందులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పొదుపుతో పాటు బ్యాంక్‌ల ద్వారా ఆర్థిక స్వావలంబన పొంది తమ కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చుకోవాలని అన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేల బ్యాంక్ రుణాలు అందించాలని సూచించారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 24నుంచి 28వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, టీజీబీ రీజనల్ మేనేజర్ ప్రభుదాస్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

● సదరం సర్టిఫికెట్లలో మరో 21 అంశాలు

ఆదిలాబాద్ రూరల్: సదరం సర్టిఫికెట్లలో ప్రభుత్వం మరో 21 అంశాలను జోడించిందని, ఎలాంటి ఇబ్బందులు సర్టిఫికెట్లను జారీ చేసేల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం రిమ్స్‌లోని సదరం క్యాంప్ కార్యాలయంతో పాటు శిబిరం నిర్వహించడానికి స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణంలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను పరిశీలించి మ్యాప్‌ను చూశారు. ఈ స్థలం సదరం క్యాంప్ నిర్వహణకు అనువుగా ఉంటుందని భావించి ప్రభుత్వానికి నివేదికలను పంపించనున్నారు. అంతకు ముందు గతంలో సదరం సర్టిఫికెట్ల జారీ, పెండింగ్‌లో ఉన్న వాటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులకు సదరం ద్వారా సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. గతంలో కేవలం 6, 7రకాల దివ్యాంగులకు మాత్రమే సర్టిఫికెట్లను అందించే వారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం 21 రకాల వ్యాధుల దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందించేలా ప్రణాళిక చేసిందని పేర్కొన్నారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్, మిల్క,రిమ్స్ సూపరిండెంట్ డాక్టర్ అశోక్, డీపీఆర్డీఓ తిరుమల పాల్గొన్నారు.

● పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఆదిలాబాద్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 18,880 మంది విద్యార్థులు హాజరుకానుండగా, 31 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

ఆదిలాబాద్‌లో యువకుడి దారుణ హత్య

● వివరాలను వెల్లడించిన డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్యాంగ్‌లు నిర్వహిస్తూ తమతో పాటు అసాంఘిక కార్యకలాపాలు చేయాలని ప్రేరేపించి.. ఒప్పుకోకపోగా ఓ యువకుడిని ముగ్గురు యువకులు దారుణంగా హత్య చేసిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. ఈ హత్య కేసును జిల్లా పోలీసులు ఆరు గంటల్లో చేధించారు. మంగళవారం పట్టణంలోని 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి హత్య కేసు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు గోవింద్ కార్తీక్(మహాలక్ష్మివాడ), చెల్కల ప్రణీత్(ఇందినానగర్), దేవుల సాయికిరణ్(ఇందిరానగర్) జల్సాలకు తిరుగుతూ అసాంఘిక కార్యకలాపాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలోని ఒక గ్యాంగ్‌గా ఏర్పడి నేరాలను చేయాలనే ఒక దురుద్దేశంతో ఉన్నారు. కాగా వీరు క్రాంతినగర్‌కు చెందిన కొమ్మవార్ (26)ను తమతోపాటు తిరుగుతూ నేరాలకు కలిసి పాల్పడదామని ఆలోచనతో అతనిని ప్రేరేపించారు. కాగా దీనిని రవితేజ నిరాకరించాడు. దీంతో ఈ ముగ్గురు సోమవారం అర్ధరాత్రి మద్యం తాగి.. మద్యం మత్తులో పని ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న కొమ్మవార్ రవితేజను మార్కెట్ యార్డ్ వెనుక ఇందిరానగర్‌లో దారి మధ్యలో అడ్డగించికత్తితో పొడిచి హత్య చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్య ప్రవళిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు.. కేసు దర్యాప్తు ముమ్మరం చేసి 6 గంటల వ్యవధిలోని ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీసులు కేసును చేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కత్తి, మొబైల్ ఫోన్‌లను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి : సుగుణ

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులు కోరారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకూబ్ బేగ్, సోన్ కాంబ్లే సూరజ్, పరత్ వాగ్ విశాల్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

● సర్కార్ కొలువులు కాంగ్రెస్‌తోనే సాధ్యం

తలమడుగు: నిరుద్యోగులకు సర్కారీ కొలువులు కాంగ్రెస్‌తోనే సాధ్యమని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దేవాపూర్, బరంపూర్ గ్రామాల్లో ఆయనతో పాటు బొల్లారపు బాబన్న, కల్యాణం రాజేశ్వర్‌లు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వి. నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ఉట్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని లక్కేటిపేట్ గ్రామానికి చెందిన ఉప్పు నర్సయ్య ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం కింద ఇళ్లు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు కోలిపాక రాజశేఖర్, దావలే బాలాజి, కందుకూరి రమేష్, సోంటకే వెంకట్, పొన్నం తిరుపతి, పొన్నం వెంకటేశ్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడే మహా శివరాత్రి

(5వ పేజీ తరువాయి...)

ఉన్న కుమార్‌పేట్‌లోని గంగపుత్ర శివాలయంలో వేకువజాము నుంచే శివుడికి రుద్రాభిషేకం, బిల్వపత్ర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. లింగాకారంలో ఉన్న శివుడికి శుద్ధజలంతో, ఆవుపాలతో, పంచామృతంతో వివిధ పూజా ద్రవ్యాలతో, పుష్పాలతో అభిషేకించుకుని ముఖ్యంగా మారేడు దళాలను, బిల్వపత్రాలను, తుమ్మి పూలను, గోగుపూలు, తెల్లని, పచ్చని పూలతో శివనామాలను కాని పంచాక్షరి మంత్రమైన ఓం నమః శివాయ అని స్మరిస్తూ పూజిస్తారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రాత్రి నుంచి శివనామస్మరణతో పాటు భక్తి, జానపద పాటలతో జాగరణ ధూంధాం కార్యక్రమాల నిర్వహనకు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అదేవిధంగా రాంనగర్‌లోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జున సమేత శివాలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, లింగాష్టక పారాయణం, సాయంత్రం పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. అటూ కైలాస్‌నగర్‌లోని శివాలయంలో ఉదయం అభిషేకం, అర్చన, లింగాష్టక పూజా కార్యక్రమంతో పాటు రాత్రి శివనామస్మరణతో జాగరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. క్రాంతినగర్ శివాలయంలో రుద్రాభిషేకం, శివపార్వతుల కళ్యాణం, అర్ధరాత్రి లింగోద్భవం, అనంతరం శివలింగానికి అభిషేకం నిర్వహించనున్నారు. అదే విధంగా దస్నాపూర్ శివాలయంతో పాటు గోపాలకృష్ణ మందిర్‌లో రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్కెట్‌లో సందడే సందడి

మార్కెట్‌లో పూజా వస్తువులను కొనుగోలు చేసేందుకు భక్తులు, ప్రజలు బారులు తీరారు. కందగడ్డలు, పూలు, శివపార్వతుల మూర్తులను, పిండి వంటలను కొనుగోలు చేసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో జిల్లా కేంద్రానికి తరలి వచ్చారు. పండ్ల మార్కెట్లన్నీ జనం రద్దీతో కలకలలాడుతున్నాయి. శివాజీచౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, వినాయక్, రైతుబజార్, తదితర ప్రాంతాల్లో విక్రయాలతో సందడిగా సాగుతున్నాయి. మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు పండ్లు కొనుగోలు చేసుకుంటూ ఉత్సాహంగా కనిపించారు. దీంతో ద్రాక్ష, యాపిల్, పుచ్చ, కర్బూజ, బొప్పాయి, సపోట, మొరంగడ్డ, పైనాపిల్, దానిమ్మ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్, కివీ, అరటి, ఇతర పండ్లను కొనుగోలు చేశారు. దీంతో ఆదిలాబాద్ మార్కెట్‌లో పెద్దఎత్తున జన సందోహం నెలకొంది.

భక్తుల ఉపవాస దీక్షలు

మహా శివరాత్రి పండుగకు ప్రత్యేకంగా ఉపవాస దీక్షలు చేపట్టే భక్తులు జాగారాలు చేస్తూ స్వామివారిని స్మరించుకోనున్నారు. మహాశివరాత్రి రోజు ఉపవాస దీక్షను చేపడితే పరమశివుడు ఆశీస్సులు ఉంటాయని భక్తుల విశ్వాసం. ఈ మేరకు ఉదయం నుంచే ఆయా ఆలయాలకు భక్తులు తరలిరానున్న సందర్భంగా ఆయా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేయగా.. భక్తుల కోలాహలంతో ఆలయాలు శివనామస్మరణంతో మార్మోగనున్నాయి. శివరాత్రికి చేసే ఉపవాసానికి, జాగరణకు విశేష ప్రాధాన్యం ఉంది. ఉపవాసం ఉండే రోజు ఉదయం సూర్యోదయానికి ముందే నిద్ర లేస్తారు. శివరాత్రి రోజు పగలంతా ఉపవాసం ఉండి, రాత్రి సమయంలో శివుడి అనుగ్రహం నిదర పోకుండా (జాగరణ) మేల్కొని భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, పూజలు, భజనలు చేస్తారు. ఇందులో భాగంగా శివుడికి పాలాభిషేకం చేసి శివపార్వతులను దర్శించుకోనున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపూర్ గ్రామానికి చెందిన కొరెంగ హనుమంతు అనే వ్యక్తి ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం అర్ధరాత్రి దగ్ధమైంది. బాధితుడి వివరాల ప్రకారం.. కుటుంబీకులతో కలిసి తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఒక్కసారిగా ఇల్లంతా వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికి మంటలు ఆరక పోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు ఆర్పేలోగానే ఇల్లంతా ఖాళీ బూడిదయ్యింది. దీంతో రూ.17 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

● డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు కోరారు. పట్టణంలోని ఎంజేపీ కళాశాల అధ్యాపకులను మంగళవారం రోజు కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, జిషాన్ అలీ, శేఖర్, గాజుల రవికుమార్, మనోజ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి ప్రచారం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి తెలిపారు. జిల్లాలోని నిర్మల్, ముథోల్ నియోజకవర్గంలోని ప్రైవేట్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, ముథోల్ మహిళా కాంగ్రెస్ నాయకులు వాసవి, లక్ష్మీ, రేఖ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం మండలం ధర్మాజీపేట్ గ్రామంలో ..

కడెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కడెం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రతి ఒక్క పట్టభద్రుడి ఓటరును కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలుస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ లక్ష్మణ్, జగన్‌రెడ్డి, లింబన్న, యాదగిరి భూమేష్, సత్యం, కన్నె శ్రీనివాస్, రాజన్న, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) మండల కేంద్రంలో ..

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జడ్పీటీసీ అర్గుమీది రామయ్య నాయకులు కోరారు. మంగళవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలో పలు వార్డుల్లో వారు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు ఎజాజ్, జక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం ముగిసింది. మండల కేంద్రంలోని వాణి స్కూల్, రాచాపూర్‌లోని గ్లోబల్ అభ్యాస స్కూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటెల శ్రీనివాస్ ఓటర్లను కోరారు. సకాలంలో జాబ్ క్యాలెండర్ అమలు, పాత పెన్షన్ విధానం అమలు గురించి, మేనిఫెస్టోలోని వివిధ అంశాల గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో నాయకులు బిట్లింగ్ రజినీకాంత్, అస్గర్, సమ్మెట రవి, సొన్న భీమేష్, బీసీ మండల అధ్యక్షుడు ముద్రబోయిన వినేష్ పాల్గొన్నారు.

మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలు ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ కార్యాలయ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణ వితరణ చేశారు. సెల్ఫ్ హెల్ప్, పీఎంఈజీపీ క్రింద రూ. 50 కోట్ల రుణ వితరణ గావించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ... ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్,చేపల ఉత్పత్తి లాంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిర్మల్ జిల్లా చేపల రుచి రాష్ట్ర వ్యాప్తంగా చూపించాలన్నారు. నిర్మల్ బొమ్మల అంతటి ప్రాముఖ్యాన్ని కల్పించాలన్నారు. బ్యాంకు రుణాలతో కొత్త వ్యాపారాలు చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలోని మహిళా సంఘాలు అతి తక్కువ ఎన్‌పీఏతో తమ ఘనత చాటారన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ మాట్లాడుతూ... సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. గ్రామీణ బ్యాంకు మేనేజర్ రామారావు మాట్లాడుతూ... నిర్మల్ జిల్లా అభివృద్ధికి దోహదం చేసే ఎలాంటి పరిశ్రమలకైనా రుణాలు అందిస్తామన్నారు. జిల్లాలోని 32 శాఖల ద్వారా రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ఏపీడీ జ్ఞానేశ్వర్, ఎస్ఎంటీ విలాస్, ఎస్ఎంవో అభినయ, మహిళా సంఘాలు పాల్గొన్నాయి.



మహిళా సంఘాలకు రుణ వితరణ చేస్తున్న అధికారులు

బెట్టింగ్ నిర్వాహకులకు బ్యాంక్ ఖాతాలను అప్పచెబితే అనర్థాలే

● భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్



పోలీసులు స్వాధీనపరుచుకున్న ద్విచక్ర వాహనాలు

భైంసా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రలోభాలకు తలొగ్గి సైబర్ మోసగాళ్లకు, బెట్టింగ్ నిర్వాహకులకు బ్యాంక్ ఖాతాలను అప్పచెబితే అనర్థాలు తప్పవని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం భైంసాలోని ఓవైసీనగర్ కాలనీ పరిధిలో పోలీసుశాఖ చేపట్టిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత కొంత కాలంగా కొంత మంది బెట్టింగ్ నిర్వాహకులు, సైబర్ మోసగాళ్లు అమాయకులకు డబ్బులను ఏరగా చూపి వారి ద్వారా బ్యాంక్ ఖాతాలను తెరిపించి వాటిని బెట్టింగ్ డబ్బులు జమ కోసం, నగదు బదిలీల కోసం వినియోగిస్తున్నారని వివరించారు. ఇలాంటి మోసాలపై ఖాతాదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఇప్పటికే పదుల సంఖ్యలో బ్యాంక్ ఖాతాలు అప్పచెప్పిన వారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇకనుంచైనా ఎవరు కూడా తమ తమ బ్యాంక్ ఖాతాలను ఇతరులకు అప్పచెప్పి కష్టనష్టాలు ఎదుర్కొవద్దని తెలిపారు. ఇదే క్రమంలో తమ తమ ప్రాంతాల్లో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల విక్రయాలు జరుగకుండా ఆయా ప్రాంతాలవాసులు వ్యవహరించాలన్నారు. అంతేకాకుండా అలాంటి విక్రయదారుల వివరాలను పోలీసుశాఖకు అందచేయాలన్నారు. ప్రధానంగా విక్రయాలు జరిగే ప్రాంతాల్లో యువకులు అధికంగా వాటి బారినపడి వ్యసనబారులుగా మారి జీవితాలను అస్తవ్యస్థం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటి నుంచి తమ ప్రాంత యువతను కాపాడుకునేందుకు, సైబర్ మోసగాళ్లు, బెట్టింగ్ నిర్వాహకులు, మత్తు పదార్థాల విక్రయదారుల దుశ్చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు గాను ఓవైసీనగర్ కాలనీవాసులు పోలీసుశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తల్లితండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతే పట్టుబడితే తల్లితండ్రులపై కేసుల నమోదు చేస్తామని వెల్లడించారు.శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావిస్తూ పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసం కొద్ది రోజుల్లోనే ప్రారంభం కానున్న దృష్ట్యా ముస్లిం సోదరులందరూ నియమ,నిష్టలతో నడుచుకోవాలన్నారు. భక్తిప్రవత్తులతో ప్రార్థనలు నిర్వహించుకుంటూ ఆధ్యాత్మికతో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా భైంసా టౌన్ సీఐ గోపినాథ్ సారథ్యంలో ఎస్ఐలు శ్రీనివాస్ యాదవ్, గౌసల నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఓవైసీనగర్ పరిధిలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. కాలనీ పరిధిలోని 230 నివాస గృహాల్లో సోదాలు చేపట్టారు. ఇందులో సరియైన ధృవీకరణ పత్రాలు లేని 104 ద్విచక్ర వాహనాలన, 4 ఆటోలను సీజ్ చేశారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడాలి

తానూర్ , ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగవారం నిర్వహించిన వాగ్దేవి స్కూల్ యొక్క గ్రాడ్యుయేషన్‌డేలో ఎమ్మెల్యే రామరావుపాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్య సాధన కోసం కష్టపడాలన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువుల పేరు నిలబెట్టాలన్నారు. అనంతరం మండలంలోని కళ్యాణి గ్రామంలో నిర్వహించిన శివాజీ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. శివాజీ మహారాజ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈయన వెంట మండల బీజేపీ అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, శివాజీపటేల్, మారుతి, చక్రధర్‌పటేల్, బాలాజీ, సోమ్‌నాథ్, సురేష్‌పటేల్, మాధవ్ తదితరులున్నారు.

వైభవోపేతంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలోని అక్కాపూర్ రేణుక ఎల్లమ్మ బోనాలు వైభవోపేతంగా జరిగాయి. మంగళవారం నిర్మల్ గీతా పారిశ్రామిక సహకార సంఘం నుంచి గౌడ కులస్తులు,మహిళలు మంగళహారతులతో రేణుక అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కాపూర్ గ్రామంలో ఉన్న ఆలయం వరకు నృత్య విన్యాసాలు చేస్తూ అమ్మవారిని ఊరేగించారు. బైండ్ల వారి మేక గావు పట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అక్కాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కళ్యాణం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీహరిరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శోభ సత్యనారాయణ గౌడ్, మామడ మాజీ జడ్పీటీసీ సభ్యులు సుధ జీవన్ గౌడ్, లింగాగౌడ్, దేవేందర్‌గౌడ్, రాజాగౌడ్, వేణుగోపాల్ గౌడ్, కృష్ణమోహన్‌గౌడ్, రవీందర్‌గౌడ్, మురళిగౌడ్, గణేష్‌గౌడ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రగామి

మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపారని ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్లుగా దేశానికి అందిస్తున్న సేవలు రికార్డు సృష్టిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే భాజపా నాయకుడు నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, భాజపా నాయకుడు, నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ అధ్యక్షుడు వి.సత్యనారాయణగౌడ్ అన్నారు. మండలంలోని మేడిపల్లి, నీలాయిపేట్, అనంతపేట్ గ్రామాల్లో మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రపంచంలోనే భారత దేశ ఆర్థిక వ్యవస్థను ఐదో స్థానంలో నిలిపిన ఘనత ప్రధానిదని కొనియాడారు. అవినీతి లేని సమర్థవంతమైన పాలన అందిస్తూ, దేశం కోసం, ధర్మం కోసం అవిశ్రాంతిగా పాలన కొనసాగిస్తున్నారని, ఆయన అందిస్తున్న అత్యుత్తమ పాలనను ఆమోదించడంలో భాగంగా భాజపా బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సి. అంజిరెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో అంకితభావంతో కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, సీనియర్ నాయకుడు జమాల్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అనిల్, నాయకులు చింతలపల్లి సాయరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, లవ కుమార్‌గౌడ్, మురళిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి ఓటు వేయండి

మామడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పార్టీకి ఓటు వేయాలని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు న్యాయవాది రంజిత్ కుమార్ అన్నారు. మంగళవారం మామడ మండలంలోని కొరిటికల్, పొన్కల్ గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయుల అభ్యర్థి కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల ప్రెసిడెంట్ రంజిత్ కుమార్, గోవర్దన్ రెడ్డి, పీఎస్‌సీఎస్ డైరెక్టర్ చిన్నారెడ్డి, పవన్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రాప్ లోన్ ఇన్సురెన్సూ ప్రయోజనకరం

భైంసా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు బ్యాంక్‌లలో పంట రుణాలు తీసుకునే సమయంలో ఇన్స్‌రెన్సూ చేయించుకోవడం ప్రయోజనకరమని మిర్జాపూర్ ప్రాథమిక సహకార సంఘం చైర్మెన్ ఆమేడ దేవేందర్ రెడ్డి, మేనేజర్ కె. గంగయ్యలు పేర్కొన్నారు. మంగళవారం పీఏసీఎస్ పరిధిలో పంట రుణాల తీసుకున్న సమయంలో ఇన్స్‌రెన్సూ చేయించుకొన్న ఇద్దరు రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా వారి కుటుంబాలకు బీమా ద్వారా అందిన రూ 2 లక్షల చెక్కులను అందచేసిన సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంట రుణాలు తీసుకునే సమయంలో రైతన్నలు విధిగా ఇన్స్‌రెన్సూ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మృతి చెందిన రైతులు పెండ్‌పెల్లి గ్రామానికి చెందిన దేశెట్టి మహేందర్, కోతల్‌గావ్ గ్రామానికి చెందిన అమెద గజ్జారామ్‌ల కుటుంబీకులకు ఇన్స్‌రెన్సూ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు.ఇందులో పీఏసీఎస్ కార్యదర్శి వడ్నపు రాజేందర్, సూపర్‌వైజర్లు అభిలాష్ గౌడ్ , అశోక్, కార్యాలయపు సిబ్బంది సురేష్, సాయినాథ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బేటీ బచావో .. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని విజయ హైస్కూల్‌లో మంగళవారం జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి మాట్లాడుతూ... మహిళలపై జరిగే అఘాయిత్యాలు ఎలా ఎదుర్కోవాలో వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, అనర్థాలు తెలియజేశారు. నిత్య జీవితంలో ఉండాల్సిన అలవాట్లు, ఆహారపు అలవాట్లు తదితర వాటిపై ఫైనాన్స్ లిటరసీ శైలజ వివరించారు.

భక్తి




కదిలి పాపహరేశ్వర స్వామి దేవస్థానం



ఆలయంలో కొలువైన విఘ్నేశ్వరుడు, శ్రీకృష్ణుడు



పాపహరేశ్వర స్వామివారి చెంత అన్నపూర్ణేశ్వరి దేవి



బాబాపూర్‌లోని పురాతన రాతి శివాలయం

మహా శివరాత్రికి ముస్తాబైన
శైవ క్షేత్రాలు

- జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రికి శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- భక్తులను అత్యధికంగా ఆకర్షిస్తున్న బాబాపూర్‌లోని రాతి శివాలయం
- ప్రత్యేకంగా పూజలందుకోనున్న మహాదేవుడు
- భక్తుల కోసం ఆలయాల్లో ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు

శివ కేశవులు కొలువైన దివ్యక్షేత్రం.. ఏక్‌నాథ్ మందిరం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివకేశవులు కొలువై భక్తులకు దర్శనమిస్తున్న ఏకైక దివ్య క్షేత్రం ఏక్‌నాథ్ మందిరం. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఉన్న ఈ అతి పురాతనమైన ఆలయంలో శివ కేశవుల తోపాటు విఘ్నేశ్వరుడు, అన్నపూర్ణేశ్వరి దేవి కొలువైన భక్తులకు దర్శనమిస్తున్నారు. మేము వేర్వేరు కాదని, ఒక్కరమే అనే సందేశాన్ని ఇస్తూ ఏక్‌నాథ్‌స్వామి అయ్యారు. ఎంతో ప్రాచీనమైన ఈ ఆలయాన్ని సందర్శించి పూజలు ఆచరించినవారి కోరికలు ఇట్టే నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ముస్తాబైన శివ కేశవులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల పూజలందుకునేందుకు శివ కేశవులు ముస్తాబయ్యారు. శివ కేశవులు ఒకేచోట కొలువైన ఈ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ కోరికలను చెప్పుకుంటారు. ఏడాది తిరిగే లోగానే వారి కోరికలు నెరవేరుతుండటంతో ఏడాది ఏడాదికి భక్తుల రద్దీ పెరుగుతోంది. మహాశివరాత్రి రోజున భక్తులు జాగారం చేస్తారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు శివరాత్రి ఉపవాసం విరమించేందుకు గురువారం అనే ప్రసాదవితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.



బోథ్‌లోని శివ మార్కండేయ ఆలయం

శివరాత్రి వేడుకలకు సిద్ధమైన ఆలయాలు

బోథ్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు శివరాత్రి మండల కేంద్రంలోని శివ మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను అలంకరించి భక్తులు దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేగాక మండలంలోని కుచులాపూర్ గ్రామం సమీపంలోని చిన్నవాగు వద్ద జాతర జరగనుంది. అంతేగాక ఈసారి సోనాల గ్రామం సమీపంలోని శివాలయంలో సైతం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అంతేగాక తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కైలాస్టేగిరి ఆలయం వద్ద సహితం ఈ ఏడాది సహితం జాతర జరగనుంది. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేయనున్నారు.



దిలావర్‌పూర్‌లోని ఏక్‌నాథ్ మందిరం

కదిలి పాపన్న దర్శనం.. సర్వ పాపహరణం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోరిన వారి కొంగుబంగారమై భక్తుల పూజలందుకుంటున్న శ్రీనివా మాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వరాలయం మహా శివరాత్రికి జాతరకు ముస్తాబైంది. మంగళవారం సాయంత్రం పాపహరేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను మండలంలోని సాంగ్వికి తరలిస్తారు. అక్కడ రాత్రి బస చేసి బుధవారం తెల్లవారు జామున సమీపంలో పవిత్ర గోదావరి నదీమ తల్లి జలాలతో శుద్ధి చేసి తిరిగి కదిలికి చేర్చడంతో జాతర ప్రారంభమవుతుంది.

పరుశురాముడికి పాప విమోచనం చేసిన పావన క్షేత్రం

పరుశురాముడిని మాతృ హత్య మహా పాతకం నుంచి విముక్తం చేసిన పావన క్షేత్రంగా కదిలి పాప హరేశ్వరాలయానికి ప్రతీతి. తండ్రి ఆజ్ఞననుసరించి తల్లి రేణుక మాతను చంపిన పరుశురాముడు పాప విముక్తి కోసం దేశ వ్యాప్తంగా 31 శివలింగాలను ప్రతిష్టించి పూజలు చేసినప్పటికీ పరుశురాముడికి మనశ్శాంతి లభించలేదు. చివరికి సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య పెద్ద లోయలో 32వ శివలింగం ప్రతిష్ఠించి పూజలు చేయడంతో పరమ శివుడు ప్రత్యక్షమై పరుశురాముడిని పా విముక్తం చేసినట్లు, అప్పటి పాప హరేశ్వర స్వామిగా భక్తుల పూజలందుకుంటున్నట్లు ఆలయ పురాణం చెబుతోంది.

సప్తగుండాల జలంతో సర్వరోగాలు నయం

ఆలయ పరిసరాల్లో ఋషి గుండం, గోముఖ గుండం, సూర్యగుండం, చంద్రగుండం, తదితర ఏడు గుండాలున్నాయి. వీటిలోని నీటితో స్నానమాచరిస్తే చర్మ వ్యాధులు, ఇతరత్రా వ్యాధులు నయమవుతాయని భక్తులు నమ్ముతారు. రైతులు వీటిలోని నీటిని పాడి పంటలపై చల్లుతారు.



పరుశురాముడు ప్రతిష్ఠించిన మహా శివలింగం

చీడపీడలు ఆశించవని అంటారు.

సతానప్రదాయిని... మహా వటవృక్షం

ఋషి గుండం పక్కనే 18 వృక్షాలతో కూడిన మహా వటవృక్షం ఉంది. దీని చుట్టూ ప్రదక్షిణలు చేసి కోరిక చెప్పుకుంటే ఏడాదిలోపు నెరవేరుతుందని భక్తుల విశ్వాసం. సంతాన లేమితో బాధపడే వారు మహా వటవృక్షం చుట్టూ ప్రదక్షిణ చేసిముడుపులు కడితే తప్పనిసరిగా సంతానమవుతుందని భక్తుల నమ్మం.

కనువిందుగా కళ్యాణ మహోత్సవం

బుధవారం స్వామివారికి అభిషేక పూజలు, బిల్వార్చన పూజలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల దర్శనం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నిశి పూజ అనంతరం శివపార్వతుల కళ్యాణ మహోత్సవ జరుగుతుంది. అనంతరం ఆది దంపతులకు పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. గురువారం ఉదయం నుంచి భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరిగే మహా శివరాత్రి జాతరలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. ముఖ్యంగా బాబాపూర్, మల్లాపూర్, మునిపెల్లి, చింతల్ చందా, లక్ష్మణచాంద ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఈ ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక ప్రజలు ఉపవాస దీక్షలతో పూజలు చేయటం ఆనవాయితీగా కొనసాగుతోంది.

పురాతన రాతి శివాలయానికి ప్రత్యేక పూజలు

బాబాపూర్‌లోని పురాతన రాతి శివాలయానికి భక్తుల నుంచి ప్రత్యేక ఆదరణ లభిస్తోంది. ఈ ఆలయాన్ని పూర్తిగా రాతి స్తంభాలతో నిర్మించటంతో సహజ ఆలయ సౌందర్యం భక్తులను అత్యధికంగా ఆకర్షిస్తోంది. దీని కారణంగా అత్యధిక మంది భక్తులు ఈ ఆలయంలోని శివలింగాన్ని, రాజరాజేశ్వర స్వామిని, మహాశివుడి విగ్రహాన్ని దర్శించుకోవటం కోసం ఉదయం 3 గంటల నుండి క్యూలో నిల్చుంటారు. ఇక్కడ మూడు రోజులపాటు జాతర కొనసాగనుంది. రథోత్సవానికి భక్తులు పెద్దఎత్తున హా జరుకానున్నారు.

మునిపెల్లిలో సహజ శివలింగాలు

దక్షిణ గంగగా పిలువబడే మునిపెల్లి గోదావరి రేవులోని లింగాల మడుగులో గ్రామస్థులతోపాటు సమీప గ్రామాల ప్రజలు పవిత్రస్నానం చేసి సహజ శివలింగాలు, శివ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ పర్వదినం సందర్భంగా సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరవుతారు.

మల్లాపూర్ శివాలయానికి పోటెత్తనున్న భక్తులు

మల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయానికి భక్తులు పోటెత్తనున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే లక్ష్మణచాంద గ్రామంలోని అష్టభుజ వేణుగోపాల స్వామి, చింతల్‌చందాలోని శివ గణపతి ఆలయంలో కూడా భక్తితో పూజలు చేసి ఉపవాస దీక్షను విరమిస్తారు. అన్ని ఆలయాల్లో కూడా పర్వదినాన్ని పురస్కరించుకొని జాగారం జరగనుంది.



బాబాపూర్ ఆలయం ఎదుట గల నందీశ్వరుడు, మహా శివుడి విగ్రహం



పాపహరేశ్వర ఆలయ ప్రధాన ద్వారం పక్కన కొలువైన వరాహ స్వామి విగ్రహం



ఏక్‌నాథ్ మందిరంలో కొలువైన మహా శివుడి విగ్రహం

ముస్తాబైన ఏక బిల్వ చర్లపల్లి శివాలయం

తలమడుగు, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం చర్లపల్లి గ్రామంలో గల ఏకబిల్వ శివాలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. గ్రామ సమీపంలో గల వైకుంఠ ధామంలో కాశీలో ఉండే ఏక బిల్వ పత్రం చెట్టు ఉండడంతో గ్రామస్తులంతా కలిసి శివాలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పండుగకు ఆలయంలో ప్రత్యేకపూజలు, శివపార్వతుల కల్యాణం ఉత్సవ్ విగ్రహాలతో ఊరేగింపు. ఇతర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. అదే విధంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మహాశివరాత్రికి ముస్తాబైన చర్లపల్లి ఏకబిల్వ శివాలయం

భీంపూర్‌లో ముస్తాబైన ఆలయాలు

భీంపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటి శివాలయం గుంజల, గొల్లగడ్ శివారు ప్రాంతం పెన్ గంగా ఒడ్డుపై ఉన్న పురాతన గిర్జాయి (పార్వతి దేవి) ఆలయాలు శివరాత్రి సందర్భంగా ముస్తాబు చేసి పూజలకు సిద్ధం చేశామని గిర్జాయి మాతా ఆలయ ప్రతినిధులు కుమ్ర అయ్యూ, మడావి వినోద్‌లు తెలిపారు.



పిప్పల్‌కోటిలో ముస్తాబైన శివాలయం



గుంజల, గొల్లగడ్ పెన్‌గంగా ఒడ్డున వెలసిన గిర్జాయి మాత ఆలయం



భైంసాలో వైన్స్‌ను మూసి వేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మూతపడ్డ మద్యం షాపులు

భైంసా, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి జిల్లాలోని మద్యంషాపులు మూతపడ్డాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ కమిమిషనర్, కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని 47మద్యం షాపులు, 8బార్‌అండ్ రెస్టారెంట్లు మంగళవారం నుంచి గురువారం వరకు మూసివేయబడనున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ప్రక్రియ ముగిసిన అనంతరం గురువారం సాయంత్రం 6 గంటలకు వైన్స్ షాపులు తెరుచుకోనున్నాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల ఎక్సైజ్ శాఖాధికారులు తమ పరిధిలోని వైన్స్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లను మంగళవారం సాయంత్రం మూయించారు.



జోరుగా రత్నపురి గడ్డల కొనుగోళ్లు

భైంసా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో శివరాత్రి వేడు కలను ఘనంగా నిర్వహించుకునేందుకు గాను భక్తులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని శివాలయాలను నిర్వాహకులు వేడుకల కోసం సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం శివరాత్రి సందర్భంగా చేపట్టే ఉపవాస దీక్షల్లో అల్పాహారంగా తీసుకునేందుకు గాను మహిళలు రత్నపురి గడ్డలను కొనుగోళ్లను జోరుగా చేపట్టారు. మంగళవారం భైంసా మార్కెట్‌లో ఎక్కడ చూసిన రత్నపురి గడ్డల విక్రయాలు ముమ్మరంగా కొనసాగాయి. ప్రతియేటా శివరాత్రి పర్వదిన సమయంలో వచ్చే రత్నపురి గడ్డల దిగుబడులను భక్తులు కొనుగోలు చేసి ఉపవాస దీక్ష సందర్భంగా అల్పాహారంగా స్వీకరించడం ఇక్కడి ప్రాంతంలో చాలా సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది.



భైంసాలో జరుగుతున్న రత్నపురి గడ్డల కొనుగోళ్లు


కంది పంట కొనుగోలు నిలిపివేత

బోథ్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో కొనుగోలు చేస్తున్న కందుల కొనుగోలను ఈనెల 28వరకు నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. శివరాత్రి అమావాస్య పండుగను పురస్కరించుకొని నిలిపివేస్తున్నామన్నారు. తిరిగి మార్చి1న కొనుగోలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రైతులు మార్కెట్‌కు పంటను తీసుకురావద్దని కోరారు.

మోదుగు పూల దగదగ!

ఇచ్చోడ/గుడిహత్నూర్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): హోలీకి ముందే పూసిన మోదుగు పూలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. పక్షం రోజులకు పైబడి హోలీ పండుగ ఉన్న తరుణంలో ఇచ్చోడ నుంచి సిరిచెల్మ వెళ్లే రోడ్డులో దరంపూరి గ్రామసమీపంలో కనిపించిన ఈ పూలచెట్లు మండెఎండలో దగదగా మెరుస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే గుడిహత్నూర్ మండలంలోని జాతీయ రహదారితోపాటు ఉట్నూర్ వెళ్లే రోడ్డు మండలంలో పలు రహదారుల గుండా ఇరువైపులా కాషాయరంగులో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ఇచ్చోడలో రోడ్డువైపు మెరుస్తున్న మోదుగు పూలు




ఫోటో న్యూస్



తోషం సమీపంలో విరబూసిన మోదుగు పూలు

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.8 । కనిష్ఠం 14.6

ఆదిలాబాద్

జిల్లా వార్తలు

3

బుధవారం 26 ఫిబ్రవరి 2025



● జిల్లాకేంద్రంలో ముస్తాబైన గంగపుత్ర శివాలయం



● ఇచ్చోడ మండలం సిరిచెల్మలోని శివుడి ఆలయం

నేడే మహా శివరాత్రి

▸ జిల్లాలో ముస్తాబైన శివాలయాలు ▸ విద్యుత్ దీపాలతో ప్రధాన ఆలయాల అలంకరణ ▸ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ▸ రాత్రి జాగరణ.. ప్రత్యేక పూజా కార్యక్రమాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట పెన్నిధి, భోళా శంకరుడైన ఈశ్వరుడు లింగోద్భవం చెందిన పవిత్ర దినమే మహా శివరాత్రి. మాఘ మాసం బహుళ చతుర్దశి రోజు అనంత భక్త కోటి కోసం శివలింగంగా ఆవిర్భవించిన దినం కావడంతో మహా శివరాత్రిగా పరిగణిస్తారు. 'శివ' అన్న పదానికి శుభప్రదం అని అర్థం. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. అంతేకాకుండా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వారం రోజుల ముందు నుంచే శివాలయాలను ఆలయ కమిటీ సభ్యులు రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. జిల్లాలోని ప్రధాన శివాలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రికి ముందుగానే ఆయా ఆలయాలలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. జిల్లాకేంద్రంలో ప్రధానంగా గంగపుత్ర శివాలయం, రవీంద్రనగర్‌లోని శివాలయంతో పాటు పెండల్‌వాడలో ఘనంగా నిర్వహించే శివాలయం వద్ద, రాంనగర్‌లోని మల్లికార్జున ఆలయం, సంజయ్‌నగర్, క్రాంతినగర్, సీసీఐ శివాలయాల్లో భక్తులు బుధవారం పెద్దఎత్తున పూజలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలోని పురాతన శివాలయాల్లో కూడా ఆయా మండలాల్లో ఆలయ కమిటీ సభ్యులు శివపూజకు పూర్తి ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలతో ఉదయం 4గంటల నుంచే ఆలయాలకు వచ్చి పూజలు చేయనున్నారు. కాగా శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టే భక్తులు మార్కెట్‌లోని పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. ఉదయం నుంచి భక్తుల దర్శనార్థం ఆలయాల వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు



జిల్లాకేంద్రంలో పండ్ల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి



పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

జిల్లావ్యాప్తంగా ఆయా ఆలయాలకు పోటెత్తనున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు శివాలయాలను ముస్తాబు చేశారు. కాగా, జిల్లాలో గల ఇచ్చోడ, జైనథ్, ఆదిలాబాద్, ఆదిలాబాద్ రూరల్, బోథ్, ఉట్నూర్, నేరడిగొండ, తలమడుగు, తాంసి, తదితర ప్రధాన మండలాల్లోని శివాలయాలను విద్యుత్ కాంతులతో సిద్ధం చేశారు. భక్తిశ్రద్ధలతో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు శైవక్షేత్రాలకు భక్తులు బారులు తీరనున్నారు.

విద్యుత్ దీపాలతో ముస్తాబు

భక్తులు భక్తిశ్రద్ధలతో పాటు ఉపవాస దీక్షలు చేపట్టి శివుడికి మహాశివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని ఆలయాల కమిటీ సభ్యులు ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లపై దృష్టి సారించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కుమార్‌పేట్ శివాలయంతో పాటు రవీంద్రనగర్ శివాలయం, శ్రీరాంకాలనీలోని శివాలయం, సంజయ్‌నగర్ శివాలయం, క్రాంతినగర్‌లతో పాటు వివిధ కాలనీల్లో, తలమడుగు మండలంలోని ఝరి శివాలయం, ఇచ్చోడ మండలంలోని సిరిసెల్మ శివాలయం, జైనథ్ మండలంలోని కోటి లింగాలు, తదితర ఆలయాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం భారీకేడ్లను ఏర్పాటు చేశారు.

నిర్వాహకుల ప్రత్యేక ఏర్పాట్లు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణం నడిబొడ్డున

(తరువాయి 6వ పేజీలో...)

ఫటా..ఫట్...

ముదురుతున్న ఎండలతో ఆరోగ్యానికి ప్రమాదం

● భీంరావు, మండల వైద్యాధికారి, బజార్‌హత్నూర్



ముదురుతున్న ఎండలతో ఆరోగ్యానికి కొంత వరకు ప్రమాదం ఉంటుంది. మండలవాసులు ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. వారు ఎప్పుడు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటారు. ప్రస్తుతం కొద్దిరోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు తీసుకునే జాగ్రత్తల చర్యలపై ప్రభుత్వ మండల వైద్యాధికారి భీంరావు వివరించారిలా..

ఆంధ్రజ్యోతి: కొద్దిరోజులుగా మండలంలో ఎండల తీవ్రత పెరుగుతోంది. మండలవాసులకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

అధికారి: మండలంలో గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత పెరుగుతూ వస్తోంది. అధిక ఎండల తీవ్రత వల్ల ఆరోగ్యానికి కొంత ఇబ్బంది కలుగవచ్చు. అటువంటి సమయంలో శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నటయితే ఇంటి వద్దే శరీర ఉష్ణోగ్రత తగ్గే విధంగా తడి గుడ్డతో మర్దన చేయాలి. తరువాత దగ్గర్లో ఉన్న వైద్యున్ని సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: ఇలాంటి తరుణంలో రైతులకు మీరిచ్చే సలహాలేమి?

అధికారి: మండలవ్యాప్తంగా అధిక శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో రైతులు ఉదయం సమయంలోనే పొలాలకి వెళ్లి 11గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి పనులు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ తగిలిందని ఎలా తెలుసుకోవడం?

అధికారి: శరీర ఉష్ణోగ్రత పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాడీ వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, నీరసంగా ఉంటూ తడబడడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, మూత్రం పసుపు రంగులో ఉండి మంటగా రావడం వంటి లక్షణాలను ఉంటే ఆ వ్యక్తి వడదెబ్బకు గురయ్యాడని తెలుసుకోవాలి. వెంటనే దగ్గర్లోని వైద్యున్ని సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలి?

అధికారి: ఎండలు తవ్రంగా ఉన్నపుడు గొడగు ఉపయోగించాలి, తెల్లని కాటన్ వస్త్రాలు వదులుగా ఉన్నవి ధరించాలి. బయటకు వెళ్లేటపుడు నెత్తిన టోపి లేదా రుమాలు ధరించాలి. సాధ్యమైనంత వరకు ఎండలో తిరుగొద్దు, ఉప్పు కలిపిన మజ్జిగను ఎక్కువగా తీసుకోవాలి. కొబ్బరి నీళ్ల ఓఆర్ఎస్ ద్రావణం తాగడం మంచిది.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ తగిలిన వ్యక్తికి మొదటగా ఎటువంటి చికిత్స అందించాల్సి ఉంటుంది?

అధికారి: వడదెబ్బ లక్షణాలు కనిపించిన వ్యక్తిని మొదటగా చల్లని నీడ ప్రదేశంలో గాలి తగిలేటట్లు తడిగుడ్డతో తూడుస్తూ ఉండాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గిన తరువాత సమీపంలోని వైద్యున్ని సంప్రదించాలి.

(- ఆంధ్రజ్యోతి, బజార్‌హత్నూర్)



నూతన డీడీకి స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

నూతన డీడీ ఎర్రయ్య బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎర్రయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీడీ హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ కావడంతో.. ఏపీవో జనరల్ జాదవ్ వసంత్‌రావు ఇన్‌చార్జీగా ఉన్నారు. రెండు నెలల తర్వాత ఎర్రయ్య రావడంతో డీడీ స్థానం భర్తీ అయ్యింది. ఈ సందర్భంగా కార్యాలయం పరిపాలన అధికారి గోపాల్‌నాయక్, ఏఎంవో జగన్, దేవ్‌రావులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు.

డైట్ కళాశాలలో యూడైస్ వర్క్‌షాప్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న యూడైస్ వర్క్‌షాప్‌ను డీఈవో ప్రణీత మంగళవారం సందర్శించారు. యూడైస్‌కు సంబంధించి అన్ని అంశాలను తుది నిర్ధారణ చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి పెండింగ్స్ ఉండకూడదని, అదేవిధంగా ఎలాంటి తప్పులు లేకుండా ప్రతీ పాఠశాల యూడైస్ వివరాలు నమోదు చేసి పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారులు జే.నారాయణ, సుజాత్ ఖాన్, ఉస్మానుద్దీన్, శ్రీకాంత్ గౌడ్, ఏపీవో సందీప్, తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన అంకానేశ్వర స్వామి జాతర

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్‌లో మహా శివరాత్రి సందర్భంగా అంకానేశ్వర స్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంగళవారం భజన మండలి వారు భక్తి కీర్తనలతో జాతరను ప్రారంభించారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ఆలయంలో పూజలు నిర్వహించారు. జాతర మార్చి 3 వరకు కొనసాగుతుందని గ్రామస్థులు తెలిపారు. తొగరి గూడాలు నైవేద్యంగా తమ పంట నుంచి దేవునికి ప్రసాదంగా ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత అని కమిటీ సభ్యులు పవన్ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లోనే నివాసం ఉండాలి

ఉట్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలు నియమించిన పాఠశాలలో స్థానికంగా ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడిమెత మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాల ఆశ్రమ పాఠశాలల ఏఎన్ఎంలకు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. నియమించబడిన ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ఉన్న గ్రామంలోనే నివాసం ఉంటూ అన్ని వేళల విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్య క్షేత్ర పరిధిలో గల విద్యార్థుల, ఉపాధ్యాయుల, ఇతర ఉద్యోగుల ఆరోగ్య సమాచారాన్ని నిత్యం హెడ్‌మాస్టర్‌కి తెలియపరుస్తూ.. ఫోన్ కాల్‌తో పాటు మొబైల్ యాప్ ద్వారా సెంటర్‌కి తెలపాలన్నారు. ఇందులో ఏఎంవో ఆత్రం జగన్, జీసీడీవో మేస్రం చాయలున్నారు.



మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

● ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● హాజరైన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం

ఉట్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సబ్బండ వర్గాలకు సమ న్యాయాన్ని చేకూర్చేందుకు కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతంతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, లోక్ సాహిర్ అన్నాబావుసాఠె, మాజీ ఉప రాష్ట్రపతి బాబు జగ్జీవన్ రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పుచప్పుల మధ్య సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. 10ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేయలేని అభివృద్ధిని ఒక సంవత్సరంలో చేసి చూపెట్టారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సీఎం రేవంత్‌రెడ్డిను బద్నామ్ చేస్తున్నాయని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొందరు బీజేపీ కనుసన్నలలో నడుచుకుంటూ బీజేపీ పార్టీ వల్లే వర్గీకరణ సాధ్యమందని చెప్పుకోవడం సరైనది కాదని అన్నారు. దేశంలో మతాల, కులాల మధ్య చిచ్చుపెట్టి ప్రశాంతంగా ఉన్న భారతావనిని అగ్నిగుండగా మార్చింది బీజేపీ పార్టీ కాదా? అని ప్రశ్నించారు. దళితులు, ఆదివాసీలపై దాడులు చేస్తున్న మతతత్వ బీజేపీకి వత్తాసు పలకడం దేనికి సంకేతమన్నారు. రాబోయే రోజుల్లో దేశం ప్రమాదాన్ని ఎదురుకోబోతుందని, రాజ్యాంగమే మనకు రక్ష అన్నారు. ఆ రాజ్యాంగాన్ని రక్షించడానికి కాంగ్రెస్ ముందుండి పోరాటం చేస్తోందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.12 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం వల్ల వర్గీకరణ రాలేదన్నారు. వర్గీకరణ కంటే ముందే కాంగ్రెస్ 1967 నుంచి ఈ ఆలోచన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, బిరుదల లాజర్ మాదిగ, సామాజిక కార్యకర్త అరికల అశోక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు బిక్కిగంగన్న, చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షులు దర్శనాల నగేష్, కొత్తూరు లక్ష్మణ్, భూషణ్, ఇందయ్య, ఉట్నూర్ డివిజన్ మాదిగ సంఘం, మంగ్ సంఘం పెద్దలు స్థానిక మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను సన్మానిస్తున్న నాయకులు

'ఏజెన్సీ దళితుల అభివృద్ధికి సహకరించండి'

నార్నూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న దళిత ప్రజలు అభివృద్ధి చాలా వెనుక బడి ఉంది. గత ప్రభుత్వాలు ఇప్పటి వరకు దళిత ప్రజలను పట్టించుకోలేదు. తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏజెన్సీ ప్రాంత సమస్యలు విన్నవించి ఇక్కడి ప్రజల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు కోర్రేల మహేందర్ దళిత జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరారు. మంగళవారం అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పర్యటనకు వచ్చిన ఆయనను కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు శ్రీకాంత్ మోరే, మైలారం దేవిదాస్, సుకుమార్, శ్రీకాంత్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

బోథ్ సెగ్మెంట్‌లో 5,017 మంది ఓటర్లు

బోథ్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలోని 9 మండలాలలో 19 పోలింగ్ స్టేషన్‌లో ఉండగా 5,017 మంది ఓటర్లు ఈనెల 27న తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే 3744 మంది పురుషులు 1273 మంది మహిళా ఓటర్లు ఉన్నారు అయితే వీరిలో బోథ్ మండలంలో మూడు పోలింగ్ స్టేషన్‌లో గుడిహత్నూర్, తాంసి, తలమడుగు, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, ఇచ్చోడ, భీంపూర్ మండలాలలో రెండు చొప్పున పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. అయితే ఆయా మండల కేంద్రాల్లో పట్టభదులతోపాటు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లను చేయడం జరిగిందని ఎన్నికల ప్రత్యేక అధికారి బోథ్ డిప్యూటీ తహసీల్దార్ సూరజ్ రావు ఈ సందర్భంగా తెలిపారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే కృషి

● బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే పాయల శంకర్ పని చేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్ అన్నారు. కందుల కొనుగోళ్లలో పరిమితిని పెంచడంలో కృషి చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదలు తెలుపుతూ మంగళవారం మార్కెట్ యార్డులో రైతులతో కలిసి ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్ మాట్లాడారు. మూడు క్వింటాళ్ల నుంచి ఆరు పరిమితి పెంచారని తెలిపారు. దీన్ని స్వాగతిస్తూ ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మయూర్ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

జైనథ్: మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే పాయల శంకర్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఏనుగు రాకేష్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సిడాం రాకేష్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బింగి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలి

● జిల్లా బాలల సంరక్షణ అధికారి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి డీసీపీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహం, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీవో మాట్లాడుతూ ఎంత కష్టమొచ్చినా చదువును మధ్యలో ఆపి వేయకుండా చదువుకుంటూ పోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగిన, చేస్తున్న ఎవ్వరు కూడా భయపడకుండా 1098 నెంబర్‌కు ధైర్యంగా ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లలిత కుమారి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్, షూర్ ఎన్జీవో డిస్టిక్ కోఆర్డినేటర్ కె.వినోద్, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, మహిళా సాధికారత జిల్లా కో ఆర్డినేటర్ యశోద, చైల్డ్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఈజీఎస్ ఈసీ ప్రవీణ్‌రావు

రోజుకు రెండుసార్లు ఫొటో దిగాల్సిందే

● లేకుంటే పనికి రానట్టే.. : ఈజీఎస్ ఈసీ

తలమడుగు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులకు వస్తున్న కూలీలు రోజుకు రెండుసార్లు తప్పనిసరి ఫొటోలు దిగాలని ఈజీఎస్ ఈసీ ప్రవీణ్ రావు కోరారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధి హామీలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా ఫొటో క్యాప్షన్ ద్వారా అరికట్టవచ్చన్నారు. అదేవిధంగా జాబ్ కార్డు ఉన్న ప్రతీఒక్కరికి పనులు కల్పించాలని సూచించారు. పనులకు వస్తున్న కూలీలందరికీ ప్రతిరోజు రూ.300 కూలి కలిగే విధంగా పనులు కల్పించాలన్నారు. అంతేకాకుండా ఎండ తీవ్రతలు పెరుగుతున్నందున కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం మస్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మేఘమాల, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పాలనలో 50వేల ఉద్యోగాలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే ఇచ్చిన మాట ప్రకారం 50 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణగోపాల చారి అన్నారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో పట్టభద్రుల, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, నిరుద్యోగుల కోసం చేసిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ చారి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 50 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వచ్చే నాలుగేండ్ల కాలంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జీవన్ రావు, ఆశన్న, సాత్విక్ రెడ్డి, రాహుల్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి'

బోథ్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న నరేందర్ రెడ్డిని గెలిపించాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు యాదవులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున ప్రచార నిర్వహించారు. నిరుద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఏకైక వ్యక్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.